క్లుప్తంగా

కనులపండువగా రథోత్సవం



నేమకల్లులో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

చిప్పగిరి: శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని నేమకల్లు గ్రామంలో మూడు రోజుల పాటు వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం స్వామివారి రథోత్సవ కార్యక్రమం గ్రామ ప్రజలు, పెద్దల ఆధ్వర్యంలో కనులపండువగా జరిగింది. ఉత్సవ రథాన్ని గ్రామ పుర వీధుల గుండా ఊరేగించారు. ప్రజలు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం గ్రామంలో రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

72 మందిపై బైండోవర్ కేసులు

పత్తికొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నేరచరిత్ర కలిగిన 72 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు సీఐ మురళీమోహన్ గురువారం తెలిపారు. మండలంలో సమస్యాత్మక గ్రామాలుగా అటికెలగుండు, పులికొండ, హోసూరు, పుచ్చకాయలమాడ, పందికోన, కొత్తపల్లి, చక్రాళ్ల, చందోలి గ్రామాలు గుర్తించామన్నారు. ఈ గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ జవాన్లతో కవాతు నిర్వహించి గొడవలకు తావులేకుండా ముందస్తు సూచనలు చేయడం జరిగిందన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

కోలుకోలేక మహిళ మృతి

హొళగుంద: మండల కేంద్రానికి చెందిన మంజుల (47) అనే మహిళ బళ్లారి ఓపీడీలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ పెద్దయ్యనాయుడు తెలిపారు. సదరు మహిళ ఈ నెల 11న కుటుంబ కలహాల కారణంగా నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం బళ్లారి ఓపీడీకి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ వెల్లడించారు. మృతురాలు ఇచ్చిన మరణ వాంగ్మూలం ఆధారంగా కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల పరిధిలోని పలు గ్రామాల వలంటీర్లు 38 మంది గురువారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. పుల్లగుమ్మి సచివాలయ పరిధిలోని 18 మంది, కలుగొట్ల–1 సచివాలయం పరిధిలోని 10 మంది. మల్లెపల్లె సచివాలయ పరిధిలోని 8 మంది, బింగిదొడ్డికి చెందిన ఇద్దరు ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని రాజీనామా పత్రాలు సమర్పించారు.

మద్దికెర: మండలంలోని బురుజుల, మద్దికెర గ్రామాలకు చెందిన ఐదుగురు వలంటీర్లు తిరుమలేశు, నరేష్, బాషా, చంద్రకళ, రాధమ్మ విధులకు రాజీనామా చేస్తూ పత్రాలను ఎంపీడీఓ అలివేలమ్మకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిస్వార్థంగా సేవలందిస్తున్న తమపై ప్రతిపక్ష పార్టీల నేతలు రాజకీయాలు అంటగట్టడం బాధ కలిగిందన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా పనిచేశామని చెప్పారు. ప్రతిపక్ష పార్టీలు రాజకీయ దురుద్దేశంతో తమపై బురదజల్లడంతో మనస్తాపం చెంది రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

చిప్పగిరి: మండలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు ఈఓపీఆర్డీ బాలన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోహర్ తెలిపారు. గురువారం మండలంలోని నంచర్ల గ్రామంలో మరమ్మతులకు గురైన మోటార్లను బాగుచేయించి నీటి సమస్య పరిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవిలో ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి సురేంద్ర, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సువర్ణ పాలన

హొళగుంద: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్రంలో అభివృద్ధి, సువర్ణ పాలన సాధ్యమని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలు పేదలకు భరోసానిస్తున్నాయని ఆ పార్టీ ఆలూరు నియోజకవర్గ నాయకుడు బుసినె శ్రీరాములు అన్నారు. ఆయన గురువారం గజ్జహళ్లి గ్రామంలో పార్టీ నాయకులు, ఎంపీటీసీలు మల్లికార్జున, కెంచప్ప, రమేశ్, ఇమామ్‌హుసేన్ తదితరులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. రాష్ట్రంలో దుష్ట చతుష్టయం కల్లిబొల్లి మాటలతో ప్రజలను మోసం చేయడానికి వస్తున్నారని వారిని నమ్మవద్దన్నారు. మాట తప్పని నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అలాగే ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరుపాక్షి, ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యలను గెలిపించాలని కోరారు.

అట్టహాసంగా నామినేషన్ దాఖలు

- తొలిరోజే వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బుట్టా రేణుక నామినేషన్
- జనజాతరను తలపించిన ర్యాలీ
- చేనేత బిడ్డను అక్కున చేర్చుకున్న చేనేతపురి



అభ్యర్థి బుట్టా రేణుకకు మద్దతుగా ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు



నామినేషన్ వేసేందుకు వెళ్తూ ఫ్యాన్ చిహ్నాన్ని చూపుతున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరు: ఎన్నికలకు ముందే వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సుస్పష్టమైంది. జై జగన్.. జైజై జగన్ నినాదాలు.. రేణుకమ్మ ఆత్మీయ అభివాదాలతో ఎమ్మిగనూరు హోరెత్తింది. చేనేతపురిలో చేనేత బిడ్డ బుట్టా రేణుకకు అపూర్వ ఆదరణ లభించింది. పది వేల మందికి పైగా పార్టీ కార్యకర్తలు రేణుకమ్మ వెంట ర్యాలీగా కదం తొక్కి జనజాతరగా మారారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ అభ్యర్థిగా బుట్టా రేణుక నామినేషన్ దాఖలు పర్వంతో పార్టీ శ్రేణుల్లో ఉత్తేజం ఉరకలెత్తింది. ఎన్నికల సమరానికి అంతా సిద్ధం అంటూ జనం జేజేలు కొట్టారు. జై జగన్.. జైజై జగన్ అంటూ నినదించారు.

రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాలతోపాటు, 25 పార్లమెంట్ స్థానాలకు గురువారం గెజిట్ నోటిఫికేషన్ వెలువడగా మొదటి రోజే నామినేషన్ల ఘట్టం మొదలైంది. వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ అభ్యర్థిగా బుట్టా రేణుక అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం 9 గంటలకు నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో కుటుంబ సభ్యులతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నామినేషన్ పత్రాలను స్వామి సన్నిధిలో ఉంచి పూజలు జరిపారు. పండితుల ఆశీస్సులు పొంది శిల్పా ఎస్టేట్‌లోని పార్టీ కార్యాలయానికి చేరుకొని జిల్లా నాయకులు, పార్టీ పెద్దలతో చర్చించారు. అనంతరం అశేష జనవాహినితో నామినేషన్ దాఖలుకు బయలు దేరారు. వివిధ గ్రామాల నుంచి, పట్టణంలోని అన్ని కాలనీల నుంచి తరలివచ్చిన పార్టీ కార్యకర్తలు, అభిమానులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ప్రచార రథంపైనుంచి బుట్టా రేణుకతోపాటు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, వీరశైవలింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్, బుట్టా శివనీలకంఠ, కేఆర్ రాఘవరెడ్డి, బీఆర్ బసిరెడ్డి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. కార్యకర్తలు జై జగన్.. జైజై జగన్ నినాదాలతో హోరెత్తించారు. దారి పొడవునా పండుగ వాతావరణం నెలకొంది. అయ్యప్ప స్వామి ఆలయ ఆర్చి, పెద్ద పార్కు సర్కిల్, మోర్ మార్కెట్, వైఎస్సార్ సర్కిల్, మున్సిపల్ కార్యాలయం మీదుగా సోమప్ప సర్కిల్‌కు చేరుకున్నారు. అక్కడ వేచిఉన్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి నుంచి ఆశీస్సులు పొందారు. పార్టీ అభ్యర్థి బుట్టా రేణుక, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, వై రుద్రగౌడ్, బీఆర్ బసిరెడ్డిలతో కలసి రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ కలెక్టర్ చిరంజీవికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు యుగంధర్, మాచాని వెంకటేశ్, లక్ష్మికాంత్‌రెడ్డి, ఎంపీపీలు నసురుద్దీన్, కేశన్న, లక్ష్మీదేవమ్మ, జెడ్పీటీసీలు భీమిరెడ్డి, చక్రవర్తి, వేముగోడు కృష్ణారెడ్డి, శివారెడ్డిగౌడ్, విరుపాక్షి, చైర్మెన్ డాక్టర్ రఘు, వైస్ చైర్మెన్లు నజీర్ అహ్మద్, సునీల్ కుమార్, పట్టణాధ్యక్షులు బుట్టా రంగయ్య, యువనేత బుట్టా ప్రతుల్, యూకే వీరేంద్ర, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి నాలుగు నామినేషన్లు

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు ఎమ్మెల్యే స్థానానికి టీడీపీ నుంచి గురువారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి రెండు సెట్ల నామినేషన్లు, ఆయన సతీమణి బి.నిత్యాదేవి రెండు సెట్ల నామినేషన్లను ఆర్‌ఓ చిరంజీవికి సమర్పించారు. వారి నామినేషన్లకు జనసేన, బీజేపీ ముఖ్య నాయకులు గైర్హాజరైనట్లు తెలిసింది.



బైక్ ర్యాలీ చేపట్టిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ప్రజల ఆశీస్సులతో విజయం తథ్యం

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు నాకే ఉన్నాయి. గెలుపు నాదే.. సీఎం వైఎస్ జగనన్న ఆశీర్వాదం, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, రుద్రగౌడ్‌లాంటి నేతల సంపూర్ణ మద్దతుతో ఎమ్మిగనూరు ఎమ్మెల్యేగా విజయం సాధిస్తానని అభ్యర్థి బుట్టారేణుక పేర్కొన్నారు. గురువారం నామినేషన్ దాఖలు అనంతరం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, వీరశైవలింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్, బసిరెడ్డిలతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన కుటుంబాల సభ్యులందరూ వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చారన్నారు. మండుటెండను లెక్కచేయక నామినేషన్ ర్యాలీలో వేలాదిగా పాల్గొని మద్దతు తెలిపారని, తమ విజయానికి ఇది తొలి సంకేతమని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధే తన అజెండా అని, సమస్యలను పరిష్కరించడంతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడంపై దృష్టి సారిస్తానని చెప్పారు. తన నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆమె పేర్కొన్నారు.



మాట్లాడుతున్న బుట్టా రేణుక, ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, రుద్రగౌడ్

నామినేషన్లకు పకడ్బందీ ఏర్పాట్లు

పత్తికొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ నీలపు రామలక్ష్మి ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఎన్నికల నియమావళి ప్రకారం నామినేషన్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలో వాహనాలు నిలిపేలా చర్యలు చేపట్టారు. ఆ ప్రాంతంలో ప్రజలెవరూ రోడ్డుపైకి రాకుండా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. గుత్తి రోడ్డు ప్రధాన కూడలి, ఊరువాకిలి వరకు రోడ్డును దిగ్బంధం చేసి ఆంక్షలు విధించారు. సీఐ మురళీమోహన్, ఎస్ఐ గోపాల్ గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఆ ప్రాంతంలో తోపుడుబండ్లు తీసివేయించి దుకాణాలు మూసివేయించారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ప్రజలకు సూచనలు అందించారు. నామినేషన్ ప్రక్రియకు ప్రజలు సహకరించాలని కోరారు. పత్తికొండ అసెంబ్లీ స్థానానికి తొలిరోజు ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదని ఎన్నికల అధికారిణి రామలక్ష్మి తెలిపారు.

ఆలూరు: ఎన్నికల నామినేషన్ ప్రక్రియ సజావుగా సాగేలా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆలూరు సీఐ బి.వెంకటేశ్వర్లు సూచించారు. ఆయన గురువారం స్థానిక కర్నూలు– బళ్లారి రోడ్డు, గుంతకల్లు చౌరస్తా, ఆదోని, కర్నూలు రోడ్డుకు ఇరువైపులా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏర్పాటు చేసిన బారికేడ్లను పరిశీలించారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద ఏర్పాట్లు, పోలీసు బందోబస్తును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నామినేషన్ వేసే అభ్యర్థి వెంట వచ్చే వారిని ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అనుమతించాలని, అన్ని రకాలుగా తనిఖీలు చేసి పంపాలని సూచించారు. ఆలూరు ఎస్ఐ ఓబులేసు, సిబ్బంది ఉన్నారు. గురువారం ఆలూరు అసెంబ్లీ స్థానానికి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని వెల్లడించారు.

అక్రమ మైనింగ్‌పై కేసు నమోదు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి, బేతంచెర్ల మండలాల పరిధిలో అక్రమంగా ఐరన్ ఓర్ మైనింగ్ చేస్తున్న ఇద్దరిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈనెల 18న మైనింగ్ శాఖ జిల్లా అధికారులు బేతంచెర్ల మండలం బలపాలపల్లె, వెల్దుర్తి మండలం సర్పరాజాపురం పరిధిలో కొందరు అక్రమంగా మైనింగ్ చేస్తున్నట్లు గుర్తించారు. రామళ్లకోట పరిధిలో అక్రమంగా తరలించి దాచిన ఐరన్‌ఓర్‌ను గుర్తించి వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి అక్రమంగా దాచి ఉంచిన రూ.4 లక్షల విలువగల ఐరన్‌ఓర్, రవాణా చేసిన టిప్పర్‌ను పంచనామా చేసి అక్రమ మైనింగ్, రవాణాదారులైన రామాంజి, బ్రహ్మంపై కేసు నమోదు చేసి తెలిపారు.

కూటమికి ఓటేస్తే సంక్షేమ పథకాలు ఉండవు



వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విరూపాక్షిని బుజాలపై మోస్తూ అభిమానం చాటుకున్న తిమ్మాపురం కార్యకర్తలు

చిప్పగిరి: రాష్ట్రంలో కూటమి అభ్యర్థులకు ఓటేస్తే సంక్షేమ పథకాలు ఉండవని వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి అన్నారు. ఆయన గురువారం మండలంలోని బెల్డోణ, తిమ్మాపురం, నగరడోణ, రామదుర్గం తదితర గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తిమ్మాపురంలో హేమంత్ ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో పర్యటించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 58 నెలల్లో అందించిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ప్రతి గడపకు వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలన ప్రజల ముంగిటకు తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. 2014 ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చిన చంద్రబాబు అధికారం చేపట్టాక వాటిని అమలుచేయకుండా ప్రజలను నిండా ముంచారన్నారు. ఇప్పుడు మరోసారి సూపర్ సిక్స్ అంటూ ప్రజలను మోసం చేయడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి వాటిని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. పార్టీలన్నీ ఏకమై వచ్చినా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజయాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. ఏ గ్రామానికి వెళ్లిన జగనన్న చేసిన అభివృద్ధి కనిపిస్తుందన్నారు. పార్టీ నాయకులు జూటూరు మారయ్య, మల్లికార్జున, ఓబులేసు, హేమంత్, సేనాపతి, లోకనాథ్, లాల్ స్వామి తదితరులు పాలొన్నారు.

కమనీయం.. వనం వేంకటేశుని కల్యాణం



రామళ్లకోటలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణ ఘట్టం

వెల్దుర్తి(కృష్ణగిరి): రామళ్లకోటలో వనం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవిలతో వేంకటేశ్వరస్వామి వారి పరిణయోత్సవం గురువారం కనులపండువగా సాగింది. ఆలయ మండపంలో సత్యపీఠంగా భావించే పచ్చలబండపై స్వామివారి కల్యాణ ఘట్టాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారుల వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, కర్పూర కాంతుల నడుమ వేడుక అంబరాన్ని తాకింది. సర్వజగత్తుల కల్పవల్లులు, పుణ్యాలరాశులైన భూదేవి, శ్రీదేవి అమ్మవార్ల మాంగళ్యధారణ మహోన్నతంగా సాగింది. కమనీయ దృశ్యాన్ని వీక్షించిన భక్త హృదయం అంతులేని ఆనందంతో మురిసింది. స్వామి అమ్మవార్లకు డీలర్ శేషాలు సోదరులు పట్టువస్త్రాలు, కల్యాణ ఖర్చులు సమర్పించి ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులకు ఉచిత ప్రసాదాలు, అన్నసమారాధనను బేతం వంశీయులు సమకూర్చారు. కార్యనిర్వాహకులుగా ధర్మకర్తల మండలి చైర్మన్ చింతకాయల వెంకటేశ్వర్లు, సర్పంచ్ నిర్మల, కమిటీ సభ్యులు నాగలక్ష్మమ్మ, సెక్రటరీ వెంకటేశ్ నాయక్, వీఆర్‌ఓ రమణారెడ్డి, ఆలయ సిబ్బంది మద్దిలేటి వ్యవహరించారు. రాత్రి స్వామి వార్ల హనుమద్ వాహన సేవ దాదిరెడ్డి వంశీయులచే నిర్వహించబడింది. శుక్రవారం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను సింహవాహనంపై ఊరేగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

టీడీపీ ప్రచారంలో అడుగడుగునా నిలదీత



జగనన్న సీఎం అయ్యాకే మా అత్తకు పింఛన్ వచ్చిందని టీడీపీ నాయకులకు చెబుతున్న ఎల్లమ్మ

వెల్దుర్తి(కృష్ణగిరి): ఎటు వైపు నుంచి చూసినా ఓటమి తప్పదని తెలిసినా తమ అభ్యర్థి మెప్పు కోసం వెల్దుర్తి టీడీపీ నాయకులు పడరాని పాట్లు పడుతున్నారు. ఆ పార్టీ మండలాధ్యక్షుడు బలరాం గౌడ్, శంకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఎల్ఈ జ్ఞానేశ్వర్‌గౌడ్, బొమ్మిరెడ్డిపల్లె సుబ్బరాయుడు ఒకే అరలో ఇమడలేక తప్పని పరిస్థితులలో గ్రూపులుగా ఏర్పాటై కారాలు మిరియాలు నూరుకుంటున్నారు. ప్రచార విషయంలో మీడియా లేకుండా జాగ్రత్త పడుతున్నారు. కారణం వారు వెళ్లిన ప్రతిచోట ప్రజలు తిరగబడడం, నిలదీయడం జరుగుతోంది. గురువారం టీడీపీ నాయకులు కృష్ణాపురంలో ప్రచారం నిర్వహించారు. ఎస్సీ కాలనీలో ఒక ఇంటి ముందు టీడీపీకి ఓటెయ్యండమ్మా అని అడగడంతో ఆ మహిళ ఎల్లమ్మ బిగ్గర స్వరంతో 'బాగొచ్చినారులే ఓటడగడానికి.. జగనన్న సీఎం అయినాకనే మా అత్త రామక్కకు పింఛన్ వచ్చింది, ఇంటికాడికే తెచ్చిస్తున్నారు. నాకు ముగ్గురు ఆడపిల్లలు, ఒక కొడుకు కాగా ఇంకా దండిగ పథకాలు వస్తున్నాయి' అని చెప్పింది. అవాక్కయిన టీడీపీ నాయకులు ఏదోలేమ్మా మా ప్రభుత్వమొస్తే ఇంట్లో ఇద్దరికీ పింఛన్ ఇస్తాంలేమ్మా అంటూ జారుకున్నారు. ఈ వీడియో కాస్త వైరల్ అయింది. ఇదిలా ఉండగా ఎల్లమ్మ మాటలను జీర్ణించుకోలేని ఓ టీడీపీ కార్యకర్త ప్రచారం అనంతరం ఆమెపై దాడికి ప్రయత్నించి గ్రామస్తులతో చీవాట్లు తిన్నట్లు సమాచారం. గ్రామంలోని మరో వీధిలో పలు కుటుంబాలు తమకు జగనన్న పాలనలో అన్ని సంక్షేమ పథకాలు వస్తున్నాయంటూ ఎదురు తిరగడంతో టీడీపీ నేతలు అక్కడ ప్రచారం ఆపేసి ఉడాయించడం విశేషం.

బీవీ ఆస్తులు రూ.5.28 కోట్లు

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు ఎమ్మెల్యే స్థానానికి టీడీపీ కూటమి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి తన అఫిడవిట్‌లో తన, భార్య నిత్యాదేవి పేర్లపై స్థిర, చరాస్తుల విలువ రూ.5,28,49,184 ఉండగా అప్పులు రూ.77,82,184 ఉన్నట్లు పొందుపరిచారు. అదే విధంగా చిత్తూరు జిల్లాలోనూ, ఎమ్మిగనూరు పోలీస్‌స్టేషన్లలో 3 కేసులు, ఆదోని కోర్టులో ఒక కేసు పెండింగ్‌లో ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన వద్ద నగదు రూపంలో కేవలం రూ.40 వేలు ఉండగా, భార్య బి.నిత్యాదేవి వద్ద రూ.24 వేలు మాత్రమే ఉన్నట్లు తెలిపారు.

నేడు ఆలూరుకు షర్మిల రాక

ఆలూరు: ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆలూరుకు వస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాబురావు గురువారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఆలూరులో సమావేశంలో ప్రసంగిస్తారని, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలి రావాలని కోరారు.

వైభవంగా హనుమాన్ రథోత్సవం



హాలిగేరలో భక్తుల మధ్య కదులుతున్న ఆంజనేయ స్వామి రథం

ఆస్పరి: మండలంలోని హాలిగేర గ్రామంలో ఆంజనేయస్వామి రథోత్సవం గురువారం అంగరంగ వైభంగా నిర్వహించారు. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఆలయంలో వెలసిన సీతారాముల విగ్రహాలకు పురోహితుడు రూపామోహన్‌శర్మ ఆధ్వర్యంలో గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, నందికోలు సేవ, కుంభోత్సవం, రథాంగబలి కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ పెద్ద శివారెడ్డి ఇంటి నుంచి కుంభాన్ని మేళతాళాలతో రథం వద్దకు తీసుకొచ్చి పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి భక్తుల జయజయ ధ్వనుల మధ్య రథాన్ని గ్రామ చివరి వరకు లాగి తిరిగి ఆలయం వద్దకు చేర్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

అందుబాటులో హాల్‌టికెట్లు


ఎమ్మిగనూరురూరల్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీల్లో ప్రవేశానికి ఈ నెల 25న ప్రవేశపరీక్ష జరగనుందని, పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని బనవాసి ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపాల్, సెట్ జిల్లా కన్వీనర్ జయం శ్రీనివాసగుప్త పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ 2024–2025 విద్యా సంవత్సరానికి 5, 6, 7, 8 తరగతులకు, ఏపీఆర్ఎస్ సీఏటీ–2024 ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని, అలాగే ఏపీఆర్‌జేసీ, డీసీ సెట్–2024 మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు https://aprs.apcfss.in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. అభ్యర్థులు ఒక గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

విజేత పీఆర్ పల్లె వృషభాలు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో శ్రీరామనవమి పురస్కరించుకుని గురువారం నిర్వహించిన సీనియర్ కేటగిరీ వృషభాల బండలాగుడు పందెంలో నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పీఆర్ పల్లెకు చెందిన నాగయ్య వృషభాలు రాతి దూళాన్ని నిర్ణీత సమయంలో 3,217 అడుగుల దూరం లాగి విజేతలుగా నిలిచి రూ.40 వేల బహుమతి గెలుచుకున్నాయి. తర్వాతి మూడు స్థానాలలో వరుసగా డోన్ మండలం సీసంగుంతలకు చెందిన మోహన్ రెడ్డి వృషభాలు, అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కృష్ణాపురం నాగేశ్వరరెడ్డి వృషభాలు, బేతంచెర్ల వెంకట్రాముడు వృషభాలు నిలిచి వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు గెలుచుకున్నాయి. విజేతలకు దాతలు, గ్రామ పెద్దలు బహుమతులను అందజేశారు.

తుగ్గలి: శ్రీరామనవమి సందర్భంగా గురువారం సాయంత్రం తుగ్గలిలో నిర్వహించిన దేశవ ఎద్దుల రాతి దూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీలను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మోహన్ రెడ్డి, చంద్రశేఖర రెడ్డి ప్రారంభించారు. పోటీలలో బాలతిమ్మయ్య వృషభాలు విజేతగా నిలవగా తర్వాతి స్థానంలో జయచంద్ర, ధర్మరాజు వృషభాలు సమానంగా నిలిచాయి. విజేత వృషభాల యజమానులకు వైఎస్సార్‌సీపీ నాయకులు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గిరిగెట్ల విష్ణువర్ధనరెడ్డి, రూ.10 వేలు, రూ.5 వేలు ,రూ.3 వేలు నగదు బహుమతులు అందజేశారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం



అగ్నిప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ ప్రదర్శిస్తున్న ఫైర్ సిబ్బంది

ఆలూరు రూరల్: అగ్ని ప్రమాదాలపై ప్రతిఒక్కరూ అవగాహనతో పాటు అప్రమత్తంగా ఉండాలని ఆలూరు అగ్నిమాపక అధికారి ఖాద్రి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదాల నివారణపై ఆస్పత్రి సిబ్బంది, రోగులకు అవగాహన కల్పించారు. ఆకస్మికంగా మంటలు చెలరేగితే ఎలా ఆర్పాలో డెమో ప్రదర్శించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు సమయ స్ఫూర్తిగా వ్యవహరించాలని సూచించారు. ఎలక్ట్రికల్ పరికరాలు మండేటప్పుడు విద్యుత్ సరఫరా నిలిపి వేయాలన్నారు. అగ్నిమాపక పరికరాల వినియోగంపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ వాహీద్, ఫైర్ సిబ్బంది ఉన్నారు.

టీడీపీకి ఓటు అడిగే హక్కు లేదు



వేముగోడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక, పక్కన ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య

గోనెగండ్ల: పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక స్పష్టం చేశారు. గురువారం మండలంలోని వేముగోడు, పుట్టపాశం, హెచ్.కైరవాడి గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యతో కలిసి బుట్టారేణుక రోడ్‌షో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుట్టా రేణుక మాట్లాడుతూ.. 14 ఏళ్లుగా సీఎంగా పనిచేసిన చంద్రబాబు ఏనాడూ ప్రజల సమస్యల గురించి పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు ఎన్నికల సమయంలో ప్రజల్లోకి వచ్చి అది ఇస్తా.. ఇది చేస్తా.. అని తప్పుడు హామీలు ఇస్తున్నారని దుయ్యబట్టారు. అధికారంలో ఉండగా ప్రజలను పట్టించుకోని చంద్రబాబుకు ఇప్పుడు ఓటు అడిగే హక్కు లేదన్నారు. రాష్ట్రంలో పేదల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం జగనన్న పాలన సాగించారని, ప్రజా సంక్షేమం కోసం లెక్కలేనన్ని పథకాలు అమలుచేశారని గుర్తు చేశారు. అధికారం కోసం పగటి వేషగాళ్లుగా వస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. సంక్షేమ పథకాలు గడప వద్దకే రావాలంటే మరోసారి సీఎం జగనన్నను ఆదరించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు రెండు ఓట్లను ఫ్యాను గుర్తుకు వేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో తాగు, సాగునీటిలతో ప్రజా సమస్యలను పరిష్కారిస్తానని తెలిపారు.

చంద్రబాబుది వెన్నుపోటు రాజకీయం

నమ్మిన వారిని నట్టేట ముంచి వెన్నుపోటు పొడవడం చంద్రబాబు నైజమని ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ.. గత పాలనలో ఇచ్చిన హామీలను నేరవేర్చని చంద్రబాబు ఇప్పుడు మరోసారి మయమాటలతో ప్రజల ముందుకు వచ్చారని నమ్మి మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాలను గమనించి ఓటు వేయాలని ప్రజలను కోరారు.

ఘన స్వాగతం

వేముగోడు, పుట్టపాశం, హెచ్. కైరవాడి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రోడ్ షో నిర్వహించారు. ఆయా గ్రామాల నాయకుల ఆధ్వర్యంలో వారికి గజమాలతో ఘన స్వాగతం పలికారు. దారి పొడవునా పూలవర్షం కురిపించి అభిమానాన్ని చాటుకున్నారు. నాయకులు బుట్టా ప్రతుల్, వేముగోడు కృష్ణారెడ్డి, బందెనవాజ్, సాయినాథ్, వెంకట్రామిరెడ్డి, ఓబులేష్, గంగాధర్, వెంకటేష్, మోహన్ రెడ్డి, అరుణమ్మ, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.